కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో.. రూల్లో) టమాటా లోకల్ రూ.15, వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, కాకరకాయ 32, బీరకాయ 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 17, క్యారెట్ 28, దొండకాయ 28, ఆలుగడ్డ రూ.33, ఉల్లిగడ్డ 19, గోకర 28, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 23, చిలగడదుంప రూ.70, బీట్‌రూట్ రూ.21, కీర 23, ఫ్రెంచ్‌బీన్స్ రూ.75, కాప్సికమ్ 45గా ఉన్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పోస్టర్ ఆవిష్కరణ



బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, శివస్వామి

దిల్‌సుఖ్‌నగర్: సనాతన హైందవ ధర్మం అందించిన యజ్ఞాలు, హోమాలు సకల జనుల శుభం కోసమేనని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి, శైవ క్షేత్ర వనిత శక్తి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 14న 'ఏకాహ్నిక దీక్ష పూర్వక చతుర్వేద దుర్గా సప్తశతి పూర్వక అష్టోత్తర హోమ గుండాత్మక చండీ హవనము' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌కేపురంలో ఈ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను వకుళాభరణం చేతుల మీదుగా విడుదల చేశారు. వనిత శక్తి మేనేజింగ్ డైరెక్టర్ హైమ, పీఠం మేనేజర్ కోటేశ్వరావు, ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎల్.వీ.కుమార్, ఆనంద్‌బాబు, డైరెక్టర్ సత్యలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు నకిరేకంటి రేణుక, మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ప్రిన్సిపల్ పరమేష్, డైరెక్టర్లు

చంపాపేట: ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సర ఫలితాల్లో బాలాపూర్ నారాయణ విద్యార్థులు అత్యధిక మార్కులు కైవసం చేసుకుని రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగురవేశారని మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ పరమేష్ స్పష్టం చేశారు. శుక్రవారం చంపాపేటలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో ఇంటర్‌లో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రాఘవాచారి, పర్వవతాలు, మధుకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



1969 తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించాలి

కాచిగూడ: 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్ రావు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నో త్యాగాలు చేసిన విద్యార్థి ఉద్యమ నేతలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1969 ఉద్యమ విద్యార్థి నేతల్లో ఇప్పటికే చాలా మంది చనిపోయారని, ప్రస్తుతం 50 లోపే ఉద్యమ నేతలు ఉండి ఉంటారని ఆయన తెలిపారు. విద్యార్థి ఉద్యమ నేతలు ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్టాడుతూ దినమొక నరకంగా గడుపుతున్నారని, అలాంటి వారిని ఆదుకోవాల్సిన గురుతర బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల విద్యార్థి నేత నాగయ్య(81) అనారోగ్యంతో ఆదిలాబాద్‌లో మృతి చెందాడని, ఆయన మృతి తెలంగాణ ఉద్యమకారులకు తీరని లోటు అని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమ సమయం నుంచి అయన చనిపోయే వరకు తెలంగాణ ఉద్యమకారుల కోసం ఎంతో కృషి చేశారని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నింబోలిఅడ్డాలోని జేఏసీ కార్యలయంలో ఆయన చిత్రపటానికి గోపాల్‌రావు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఉచిత ఆరోగ్య బీమా కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులు అందించిన త్యాగాలను గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని కోరారు.

కాలుష్య రహిత ప్రచారంపై దృష్టి సారించండి

కాచిగూడ: కాలుష్య రహిత ప్రచారం జరిగేలా దృష్టి సారించాలని ఎన్నికల సంఘానికి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.పి.హెచ్.రంగయ్య, జాతీయ సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో నామినేషన్ల పర్వం ముగిసిన నేపథ్యంలో నాయకులు ప్రచారం పేరుతో పర్యావరణ విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందన్నారు. పర్యావరణ హిత ప్రచారం జరిగేలా పార్టీల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఎండల్లో హాయ్..హాయ్

- కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్
- చిన్నారులతో కలిసి సేదతీరుతున్న పెద్దలు



చంపాపేట జేఎస్‌ఆర్ స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారుల సందడి

సైదాబాద్: విద్యార్థులందరికీ వార్షిక పరీక్షలు ముగియడంతో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరమంతా చదువులు, పరీక్షలతో ఉక్కిరిబిక్కిరైన చిన్నారులు సెలవులు ప్రారంభం కాగానే.. సందడి చేసేందుకు స్విమ్మింగ్ పూళ్ల బాట పట్టారు.

- మండుతున్న ఎండలకు ఈత కొలనుల్లో ఆటలే హాయిగా ఉన్నాయంటూ.. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉపశమనం పొందుతున్నారు.
- కళ్లకు రక్షణగా అద్దాలు, తలకు ప్లాస్టిక్ కవర్లు పెట్టుకుని నీళ్లల్లో ఆటలతో మురిసిపోయే చిన్నారులతో స్విమ్మింగ్ పూల్స్ కళకళలాడుతున్నాయి.
- కొందరు చిన్నారుల్లో భయాన్ని పోగొట్టేందుకు పెద్దలు కూడా ఈత కొలనుల్లో దిగి పిల్లలతో కలిసి నీటి ఆటలను ఆస్వాదిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- సెలవుల సమయాన్ని ఉల్లాసంగా గడిపేందుకు స్విమ్మింగ్‌పూల్స్‌కు వెళ్లే చిన్నారులు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు పాటించాలి.
- ఈత కొలనుల్లో లోతు ఎక్కువ, తక్కువ ఉండే ప్రాంతాలు ఉంటాయి. ఈతరాని చిన్నారులు, పెద్దలు కూడా లోతు ఎక్కువ ఉండే ప్రాంతం వైపు వెళ్లకూడదు.
- కొత్తగా ఈత నేర్చుకునేవారు, ట్యూబ్‌లతో ఈత నేర్చుకునే వారు కూడా లోతువైపు వెళ్లకూడదు.

స్విమ్మింగ్ కోచ్ పర్యవేక్షణలోనే ఆయన సూచనల మేరకు ఈత నేర్చుకోవాలి.

- సెలవుల్లో రోజు ఈతకొలనులకు వెళ్లే చిన్నారులు కళ్లకు అద్దాలు, తలకు కవర్, చెవుల్లో నీరు పోకుండా అవసరమైన పరికరాలను ఉపయోగించాలి.

కొలనుల్లో ఉల్లాసంగా నీటి ఆటలు...

- అన్ని స్విమ్మింగ్‌పూళ్లలో ఈతరాని చిన్నారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. కొలనుల్లోనే వారి కోసం లోతు తక్కువ ఉండే ప్రాంతాలను ఏర్పాటు చేస్తారు. పిల్లలు కూడా తమ ఎత్తును బట్టి అక్కడ ఉండే తక్కువ లోతు ప్రాంతాల్లో సహచరులతో కలిసి ఆటలు ఆడుతుంటారు. ఈత వచ్చిన వారు కొలనులో లోతు ఎక్కువ ఉండేచోట పలు రకాల పద్ధతుల ఈతల్లో తమలో తాము పోటీలు పెట్టుకుని ఉల్లాసంగా గడుపుతారు.

నీళ్లల్లో పిల్లలు.. గట్టుపై తల్లులు...

తమ చిన్నారులు కొలనుల్లోని నీటిలో కేరింతలు కొడుతుంటుంటే వారి తల్లులు గట్టుపై కూర్చొని వారిని చూస్తూ.. ఆనందాన్ని పొందుతుంటారు. నీళ్లల్లో వారి సంబరాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ.. తల్లులు మురిసిపోతున్నారు. నీటిలో వారి ఆటలు చూస్తూ.. వారికి జాగ్రత్తలు చెబుతూ.. తల్లులు కూడా ఎంతో ఉత్సాహంగా గడపడం ప్రస్తుతం ప్రతీ స్విమ్మింగ్‌పూల్‌లో కనపడుతుంది.

పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలి...

- సాధారణ రోజుల్లో కంటే వేసవి సెలవుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఒకేసారి కొలనుల్లోకి దిగుతుంటారు. అనుకోని సంఘటనలు జరగకుండా పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలి. అందరిపై పర్యవేక్షణ ఉంచడం కోసం వేసవిలో అదనపు కోచ్‌లు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. కొలనుల్లో ఉన్న చిన్నారులందరి కదలికలపై సిబ్బంది పర్యవేక్షిస్తుండాలి.

ఈతతో ఆహ్లాదం, ఆరోగ్యం...



మండే వేసవిలో స్విమ్మింగ్‌పూల్‌లో సమయం గడపటం చిన్నారులకు, పెద్దలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తుంది. అందరికీ ఈత ఉత్తమమైన వ్యాయామం. స్విమ్మింగ్‌పూల్‌కు వచ్చే వారి రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం.

– ఎ.రాజశేఖర్‌రెడ్డి, జేఎస్‌ఆర్ స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకుడు

నీటి ఆటలతోనే మజా...



స్విమ్మింగ్‌పూల్‌లో ఆడే ఆటల్లో వచ్చే మజానే వేరుగా ఉంటుంది. ఎంత వేడి ఉన్నా కొలనుల్లోకి దిగడంతోనే ఎంతో ఉపశమనం కలుగుతుంది. స్నేహితులతో కలిసి కొలనుల్లో ఎన్నో ఆటలు ఆడుకోవచ్చు.

– సిన్వాగ్‌రెడ్డి, 6వ తరగతి

వారంలో ఈత నేర్చుకుంటా...



స్విమ్మింగ్‌పూల్‌కు రోజు వస్తున్నాను. ప్రస్తుతం ఈత నేర్చుకుంటున్నా. కోచ్ శిక్షణతో వారం రోజుల్లో ఈత నేర్చుకుంటాను. స్నేహితులతో కలిసి కొలనులో పలురకాల ఆటలు ఆడుకోవటం ఎంతో సంతోషంగా ఉంది.

– హిదారెడ్డి, 1వతరగతి

మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్‌ను గెలిపించండి

ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఇంటింటి ప్రచారం



మలక్‌పేట: నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అక్బర్‌బాగ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి గాలిపటం గుర్తుకు ఓటేసి మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మలక్‌పేట అభివృద్ధి పథంలో ముందుకు కొనసాగుతుందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా మజ్లిస్ కృషి చేస్తోందని, మరింత అభివృద్ధి కోసం మరోసారి మజ్లిస్‌కు పట్టం కట్టాలన్నారు.

29న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

కాచిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉండే దివ్యాంగులతో ఈ నెల 29వ తేదీన బీజేపీ నగర కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 20 వేల దివ్యాంగుల ఓటర్లు ఉన్నారన్నారు. కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా సుమారు రూ. 10 కోట్లు ఖర్చు పెట్టి వివిధ రకాల సహాయక పరికరాలను అందించిన మొదటి వ్యక్తి కిషన్‌రెడ్డి అని తెలిపారు. దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేష్



సీహెచ్. సురేష్

మలక్‌పేట: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మలక్‌పేట నియోజకవర్గం అక్బర్‌బాగ్ డివిజన్‌కు చెందిన సీహెచ్ సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ వలీవుల్లా సమీర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని చెప్పారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్

సైదాబాద్: ఎన్నికల వేళ సత్ప్రవర్తనతో మెలగకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లను ఠాణాకు పిలిపించి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుల అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లొద్దని ఇన్‌స్పెక్టర్ వారికి సూచించారు. రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పోలీసులు గమనిస్తూ.. ఉంటారని, ఎవరితోనూ గొడవలు పడొద్దని, బెదిరింపులకు పాల్పడొద్దని అన్నారు. ఎన్నికలు ముగిసే వరకు పోలీసులు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండాలన్నారు. తమ సూచనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

డేంజర్ సిగ్నల్!

- ప్రమాదాలకు నిలయంగా ప్రశాంతిహిల్స్ కూడలి
- వేగాన్ని కంట్రోల్ చేయలేక తరచూ సంఘటనలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



స్పీడ్ బ్రేకర్లు లేక అస్తవ్యస్తంగా వస్తున్న వాహనాలు

మీర్‌పేట: ఇరుకుగా ఉన్న రహదారిని విస్తరించారు. రాకపోకలకు మార్గం సులువైంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ప్రధాన కూడళ్లలో మాత్రం వాహనాల వేగానికి కళ్లెం వేసే చర్యలు తీసుకోకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మీర్‌పేట నుంచి అల్మాస్‌గూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ప్రశాంతిహిల్స్ కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. అటు మీర్‌పేట నుంచి ఇటు నందిహిల్స్ నుంచి వచ్చే వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతూ పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. ప్రస్తుతం కూడలికి ఇరువైపులా రోడ్డు పెద్దగా ఉండడం, వేగాన్ని తగ్గించేందుకు కనీసం అధికారులు స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు కూడా ఏర్పాటు చేయలేదు.

రాకపోకలు ఎక్కువ

ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు వైపులా నుంచి వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడం, దీంతో పాటు నందిహిల్స్ నుంచి రహదారి దిగువన ఉండడంతో వాహనదారులు కూడలికి రాగానే వేగాన్ని కంట్రోల్ చేయలేకపోతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే రహదారిలో ప్రతి సోమవారం వారాంతపు సంత కూడా నిర్వహిస్తారని, ఏదైనా పెద్ద వాహనం అదుపు తప్పితే పెద్ద ప్రమాదమే జరుగుతుందని, కావున కార్పొరేషన్ అధికారులు స్పందించి కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేదా రబ్బరు బారికేడ్లు అయినా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



రహదారిని విస్తరించిన నాటి నుంచి ప్రశాంతిహిల్స్ కూడలిలో రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పాటు రాత్రి వేళల్లో హైమాస్ట్ లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదు.

– దాసరి బాబు, ప్రశాంతిహిల్స్

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఎంటమాలజీ సిబ్బంది

చంపాపేట: మలేరియా రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని దీనికి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని సర్కిల్ ఎంటమాలజీ ఏఈ మణి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధిలోని మారుతీనగర్, కర్మన్‌ఘాట్, ఉదయ్‌నగర్ కాలనీలలో దోమల నివారణ చర్యలపై ఎంటమాలజీ సిబ్బందితో కలసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబంలో వారంలో ఓరోజు పాత్రలు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండ పెంకుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తూ.. డ్రైడేను పాటించాలని కోరారు. ఎంటమాలజీ సిబ్బంది పెంటయ్య, శంకరప్ప, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి'



భాగ్యనగర్‌కాలనీలో కార్పొరేటర్ సుజాత

హస్తినాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని ప్రజలు గెలిపిస్తారని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దాదాపుగా అమలుచేశామని, చేసిన పనులకు తాము ఏ ప్రాంతాలకు వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం..

చైతన్యపురి: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన బూత్ ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలుపునకు అందరూ పనిచేయాలన్నారు. గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి సమిష్టి కృషితోనే డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఓట్లు వచ్చేలా చూడాలన్నారు. నాయకులు వెంకటేష్‌చారి, విజయ్, కౌశిక్, భాస్కర్, వినోద్‌కుమార్, జితేందర్, రాంరెడ్డి, యాదయ్య, శంకర్, చరణ్, వెంకన్ననాయక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్యపురిలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

మామిడి పండ్ల దుకాణాల్లో తనిఖీలు


కార్బైడ్‌తో మాగబెట్టిన 550 కిలోల పండ్లు స్వాధీనం

నాగోలు: ఇథిలీన్, కార్బైడ్ ఉపయోగించి మామిడి పండ్లకు అమ్మకాలు చేస్తున్న దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ- టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శుక్రవారం కొత్తపేట పండ్ల మార్కెట్ ఆవరణలో తనిఖీలు చేశారు. మామిడి పండ్లను ఇథిలీన్, కార్బైడ్ ఉపయోగించి మాగబెడుతున్నారన్న సమాచారంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కొత్తపేట పరిధిలో 550 కేజీల పండ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. కార్బైడ్ ఉపయోగించి పండ్లకు మాగబెట్టి అమ్మకాలు చేస్తే ఎఫ్ఎస్ఎస్ చట్టం – 2006 సెక్షన్ 58 ప్రకారం రూ. 2 లక్షల వరకు జరిమానా విధించబడుతుందని అధికారులు వివరించారు. ఫిర్యాదులకు 9100105795, 040-21111111.





శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ దేవికి అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణ చేశారు. ఉదయం ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు, భక్తులు పాల్గొన్నారు.